## క్లుప్తంగా

### రేడియం స్టిక్కర్లతో ప్రమాదాల నివారణ



రేడియం స్టిక్కర్లను అతికిస్తున్న పోలీస్ అధికారులు

**మణుగూరురూరల్:** ప్రమాదాల నివారించేందుకు ట్రాక్టర్ల వెనుక రేడియం స్టిక్కర్లను అతికించుకోవాలని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్లకు సూచించారు. డీఎస్పీ నేతృత్వంలో సీఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ట్రాక్టర్ డ్రైవర్ వాహనానికి వెనుక రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ వాహనదారుడు లైసెన్సులు, ఇన్సూరెన్స్, ఆర్సీ పుస్తకాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. సరైన ధృవపత్రాలు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు వితరణ

**కరకగూడెం:** ఇటీవల షార్ట్ సర్క్యూట్తో మండలంలోని నర్సంపేట, మోతె గ్రామాలకు చెందిన దొడ్డి సూర్యం, మెంతిని శంకర్ల పూరిళ్లు దగ్ధమవగా.. సోమవారం బాధిత కుటుంబాలకు మెడికల్ అసోసియేషన్ అండగా నిలిచింది. 50 కేజీల బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, 4వేల నగదును వారి వారి ఇళ్ల వద్ద అందజేసింది. కార్యక్రమంలో మణుగూరు మెడికల్ కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రెడీమేడ్ అసోసియేషన్ సభ్యులు సతీష్, వెంకటేశ్వరరావు, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల మెడికల్ అసోసియేషన్ సభ్యులు రాధాశ్యామ్ గుప్తా, కొమ్మ సత్యనారాయణ, ప్రసాద్, మస్తాన్, సోందుపాషా, సురేష్, ఎగ్గడి శ్రీరాంమూర్తి, దొరబాబు, ఆదినారాయణ, దినేష్, మురళి, కొమ్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్పీని కలిసిన రోశిరెడ్డి



భద్రాచలంఅర్బన్: ఎస్పీ రోహిత్రాజ్కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రోశిరెడ్డి

**భద్రాచలంఅర్బన్:** జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రోహిత్రాజ్ను సోమవారం భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛాన్ని అందించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ప్రముఖ వ్యాపారవేత్త నరసింహారావు ఉన్నారు.

**పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో..**

**అశ్వాపురం:** జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రోహిత్రాజ్ను మండల కేంద్రానికి చెందిన దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు సోమవారం కొత్తగూడెంలో ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక బహూకరించారు. ఈ కార్యక్రమంలో దోసపాటి రాము, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్కు వినతి

**దమ్మపేట:** సీపీఎం అనుబంధ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై తహసీల్దార్ ముజాహిద్కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల వాగ్దానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. ఇటీవల తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. ధరణిలో లోపాలు సరిచేసి, పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, కోలికపోగు శ్రీను, ధర్మయ్య, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చనలు, అన్నాభిషేకం, దూపదర్శనం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# మొరాయిస్తున్న ఏటీఎంలు

- ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల మిషన్లు రెండూ రెండే..
- కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి
- పంట అమ్మిన రైతులకు విత్డ్రా ఇక్కట్లు
- పర్ణశాల యాత్రికులకూ అసౌకర్యం



షట్టర్ మూసి వేసి ఉంచిన ఇండియా ఏటీఎం

**దుమ్ముగూడెం:** మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఏటీఎంలు గత కొన్ని రోజులుగా పనిచేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీనగరం గ్రామంలోని ఎస్బీఐ బ్యాంకులోని ఏటీయం గత కొన్ని నెలలుగా పని చేయడం లేదు. అయినప్పటికీ బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినియోగదారుల నుంచి వినవస్తున్నాయి. అలాగే వన్ ఇండియాకు చెందిన ప్రైవేట్ ఏటీయం సైతం గత 20 రోజులుగా పనిచేయకపోవడం వల్ల లక్ష్మీనగరం వచ్చే మారుమూల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని 100 గ్రామాలకు పైగా ప్రజలు నిత్యం లక్ష్మీనగరం గ్రామం నిత్యావసర సరుకులు, ఇతర వస్తువుల కొనుగోలు నిమిత్తం వస్తుంటారు. నగదు సరిపోక ఏటీయంలో తిద్దాం అనుకుంటే అవి పని చేయకపోవడంతో నిరాశ చెందుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో ధాన్యం, పత్తి అమ్మిన నగదు ఎకౌంట్లో పడుతుండటంతో నగదు విత్డ్రా చేయడానికి లక్ష్మీనగరం వస్తే ఏటీయంలు పని చేయకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. చేసేది లేక రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద స్వైపింగ్ ద్వారా అదనంగా డబ్బులు చెల్లించి నగదు తీసుకుంటున్నారు.

**డిజిటల్ పేమెంట్లదీ అదే గోస..**

డిజిటల్ పేమెంట్స్లకు అలవాటు పడిన ప్రజలు ఏ చిన్న వస్తువు కొన్నా డిజిటల్ చెల్లింపులకు అలవాటు పడి జేబులో డబ్బులు లేకుండా బయటకు వస్తున్నారు. ఒక్కోసారి డిజిటల్ పేమెంట్స్ పని చేయకపోవడంతో ఏటీయంలు దగ్గరకు ప్రజలు పరుగెత్తుతున్నారు. అవి కూడా పని చేయక ఇబ్బంది పడుతున్నారు.

ముఖ్యంగా సాయంత్రం సమయంలో డిజిటల్ పేమెంట్లు మొరాయిస్తుండటంతో ప్రజలు ఏటీయంల వైపు చూస్తున్నారు. పర్ణశాలకు వచ్చే భక్తులు సైతం మార్గం మధ్యలోని లక్ష్మీనగరం గ్రామంలో టీ, టిఫిన్, భోజనం కోసం ఆగినప్పుడు ఏటీయంల కోసం తిరుగుతూంటారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత ఏటీయం పని చేయడం లేదు అనే బోర్డు చూడటంతో కంగుతింటున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం..**



లక్ష్మీనగరం గ్రామంలోని ఏటీఎంలు పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిత్యావసరాల కోసం వచ్చినప్పుడు డిజిటల్ పేమెంట్లు పని చేయడం లేదు. దీంతో ఏటీఎంలు దగ్గరకు వెళితే అక్కడ అవి కూడా పని చేయడం లేదనే బోర్డులు కనిపిస్తుంది. అవి చూసి నిరాశ చెందాల్సి వస్తోంది.

– పాయం సుమంత్, ఆర్లగూడెం

**అత్యవసర సమయంలో సమస్య**



వ్యవసాయ సీజన్ కావడంతో రైతుల ఖాతాల్లోకి వ్యాపరస్తులు నగదు జమ చేస్తుంటారు. ఎక్కువ మంది గిరిజన రైతులు ఉండటంతో వారికి డిజిటల్ లావాదేవీల విషయం తెలియదు. దీంతో నగదు డ్రా చేసుకునేందుకు ఏటీయంల దగ్గరకు పరిగెత్తితే అక్కడ అవి కూడా పని చేయడం లేదనే బోర్డులు దర్శనమిస్తున్నాయి.

– కొమ్ము రంజిత్కుమార్, బండిరేవు

# కూలీల కొరతకు యంత్రాలతో చెక్



యంత్రాలతో వరినాట్లు వేస్తున్న దృశ్యం..

**బూర్గంపాడు:** యాసంగి వరినాట్లకు కూలీల కొరత ఏర్పడింది. వరినాట్లు వేసేందుకు కూలీలు దొరకక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క పత్తితీతలు, మరోపక్క మిర్చి కోతలతో కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ తరుణంలోనే యాసంగి వరినాట్లు వేసే పనులు ప్రారంభమవగా.. కూలీల కొరత ఏర్పడింది. ఒక్కసారిగా రేట్లు పెరిగిపోయాయి. దీంతో కొందరు రైతులు వరినాట్లకు యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. బూర్గంపాడు మండలంలో కూలీల కొరతతో కొందరు రైతులు వరినాట్లు వేసేందుకు మిషన్లను వినియోగిస్తున్నారు. వరినాటి యంత్రాలను అద్దెకు తీసుకువచ్చి వరినాట్లు వేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రేలలో నార్లు పోసుకున్న రైతులు ప్రస్తుతం యంత్రాలతో వరినాట్లు వేస్తున్నారు. ఈ పద్ధతిలో కూలీల రేట్ల కంటే తక్కువకు వరినాట్లు పూర్తవుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఒక ఎకరానికి రూ.5000లకు మిషన్లతో వరినాట్లు పూర్తవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ముందుగా వరినారు ట్రేలలో పోసుకుంటేనే యంత్రాలతో వరినాటే వీలుండడంతో.. ప్రస్తుతం అలా ట్రేలలో పోసుకున్నవారు మాత్రమే యంత్రాలతో వరినాట్లు వేస్తున్నారు.

# ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే దంపతులు, నాయకులు

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పోలవరం నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్యే సతీమణి తెల్లం రాజ్యలక్ష్మిలు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల పర్యటనకు వెళ్తూ, మార్గ మధ్యలోని ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు ఆలయ నిర్వహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ఏపీలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో 175 మంది భారీ మెజారిటీతో గెలిచి మళ్లీ ఏపీ సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి కావాలని పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులతోపాటు పోలవరం మండలం వైఎస్సార్ సీసీ నాయకులు పాల్గొన్నారు.

# బడి బయట పిల్లల సర్వే



బడి మానేసిన విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ కీసర లక్ష్మి

**దమ్మపేట:** మండల విద్యాశాఖ పరిధిలోని రిసోర్స్ పర్సన్లు, బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని బాలరాజుగూడెం, జగ్గారం, బూరుగుంపు, మల్లారం, పూసుకుంట గ్రామాల్లో బడికి రాని పిల్లల సర్వేను రిసోర్స్ పర్సన్లు నిర్వహించారు. ఈ సర్వే కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారిని కీసర లక్ష్మి పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా బడికి వెళ్లే వయస్సు ఉండి, బడికి రాని పిల్లలను గుర్తించి, వారి వివరాలను ప్రబంద్ పోర్టల్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. బడి మానేసిన పిల్లల తల్లితండ్రులతో మాట్లాడి, తిరిగి వారిని పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాగకృష్ణ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాల పెంపునకే పోటీలు



ప్రజ్ఞా పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై రాజ్కుమార్

**బూర్గంపాడు:** విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిఏటా నిర్వహిస్తున్న ప్రజ్ఞా పోటీలు దోహదం చేస్తాయని బూర్గంపాడు ఎస్సై రాజ్కుమార్ అన్నారు. సారపాకలోని రైతువేదికలో సోమవారం వాసవీ క్లబ్ సారపాక గ్రేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవి ప్రజ్ఞావేదిక ఐదవ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, భగవద్గీత కంఠస్థ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందించారు. 300మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వాసవి ప్రజ్ఞా వేదిక చైర్మన్ కేతేపల్లి ప్రవీణ్, కో చైర్మన్ వుడతా నగేష్కుమార్, గుడిమెట్ల సాగర్, రేపాక రాజ్యలక్ష్మి, కంచర్ల వీరభద్రం, ముత్యాలరావు పాల్గొన్నారు.

# క్రికెట్ పోటీలు ప్రారంభం

**అశ్వాపురం:** మండల పరిధిలోని చింతిర్యాల గ్రామ పంచాయతీలోని కట్టంవారిగూడెం గ్రామం యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు క్రికెట్ టోర్నమెంట్ పోటీలను సోమవారం ఎంపీపీ ముత్తినేని సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. క్రీడా పోటీల వల్ల క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు కల్లూరి లక్ష్మీనారాయణ, కుంజా రామారావు, ఎంపీటీసీ ఏనిక రవి, నిర్వాహకులు, యువత పాల్గొన్నారు.

**ఎంపీపీ పరామర్శ..**

మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ పంచాయతీ రెండో వార్డు సభ్యురాలు పిట్టా శిరీష అత్త రమణమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా.. ఆమె మృతదేహానికి ఎంపీపీ ముత్తినేని సుజాత నివాళులర్పించి శిరిష కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాదె జయ, ఉపసర్పంచ్ అక్కిన అచ్యుతరామారావు, గొల్లగూడెం ఎంపీటీసీ ఏనిక రవి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, కాంగ్రెస్ నాయకులు వీరమాచనేని రాజశేఖర్, బిక్కసాని సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**పినపాక:** ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికలు తెలిపిన వివరాల ప్రకారం.. కారం వెంకటేష్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై పినపాక నుంచి గోపాలరావుపేట వైపు వెళ్తుండగా సంతోష్, వినయ్లు మరో ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఢీకొట్టడంతో ఇరువురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించారు. ఇరువురిని 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఉత్పత్రికి తరలించారు. ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

# వాల్పోస్టర్లు ఆవిష్కరణ



చెకుముకి సంబరాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, హెచ్ఎం

**మణుగూరురూరల్:** ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే చెకుముకి సైన్స్ సంబురాలు–2024 గోడపత్రికలను ఎంఈఓ వీరస్వామి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.నాగశ్రీల చేతుల మీదుగా సోమవారం మణుగూరు జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెకుముకి పోటీలు జనవిజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో ఈ నెల 19న పాఠశాల స్థాయిలో, 27న మండల స్థాయిలో, ఫిబ్రవరి 9,10,11 తేదీల్లో జిల్లా స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పట్ల ఆసక్తి, సృజనాత్మక శక్తి పెంపొందుతాయని అన్నారు. శాస్త్రీయ ఆలోచన పరిశీలనాశక్తి పెంచడానికి, సైన్స్ అధ్యయనాన్ని ప్రోత్సహించేందుకు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఇంద్రసేనారెడ్డి, టి.విజయలక్ష్మి, వి.కృష్ణమూర్తి, నరేష్, పద్మ, రవికుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

### గడప గడపకూ అక్షింతలు పంపిణీ

**అశ్వాపురం:** మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో అయోధ్య సీతారామచంద్రస్వామి వారి అక్షింతలు సోమవారం గడప గడపకూ పంపిణీ చేశారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులు, భక్తులు, మహిళలు ఇంటింటికీ తిరిగి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం రాంబాబు, రామాలయం కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర పథకాలపై గ్రామాల్లో ప్రచారం



కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలపై మాట్లాడుతున్న ఎస్బీఐ మేనేజర్ రఘురాం

**చంద్రుగొండ:** మండలంలోని వివిధ గ్రామల్లో సోమవారం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎస్బీఐ, ఏపీజీవీబీ, తపాలాశాఖ, ఐకేసీ సిబ్బంది ఆధ్వర్యంలో సీతాయిగూడెం, దామరచర్ల గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు రఘురాం, రవికుమార్, ఐకేపీ ఏపీఎం సంతోష్కుమార్, సీఎఫ్ఎల్ కౌన్సెలర్లు నవీన్, పవన్, పోస్టుమాస్టర్లు శ్రీనివాసరావు, కౌశిక్, సీసీ రాజేందర్ పాల్గొన్నారు.

### ముస్లింల సమస్యలు పరిష్కరించండి

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం నియోజకవర్గంలోని ముస్లింల సమస్యలను పరిష్కరించాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండి.యాకూబ్ పాషా స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కోరారు. ఈ మేరకు సోమవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. భద్రాచలం పట్టణంలో 20 ఏళ్లుగా ముస్లింల షాదిఖానా శిథిలవస్థలో ఉందని, అది కూడా పట్టణానికి దూరంగా ఉన్నందున షాదీఖానా కోసం నూతన స్థలాన్ని కేటాయించి నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ముస్లింల కోసం శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని, మైనారిటీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలంలో పక్కా భవనాల నిర్మించాలని కోరారు. నియోజకవర్గంలో ముస్లింలకు మంజూరైన కుట్టుమిషన్లు వెంటనే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక మైనారిటీ నాయకులు షేక్ రబ్బానీ, సర్వర్ మియా, జాకీర్ హుస్సేన్, ఇబ్రహీం, రియాజ్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. తొలుతగా స్థానిక ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావను ఘనంగా సన్మానించారు.

### భూమి పూజ

**దుమ్ముగూడెం:** మండలంలోని రేగుబల్లి నూతన పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి సోమవారం భూమిపూజ పనులను చేపట్టారు. నిర్మాణానికి స్థలం విరాళంగా ఇచ్చిన కొడాలి లోకేష్ బాబు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజారి మోహనరావు, ఉపసర్పంచ్ జెట్టి రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ రోహిణి, పీఏసీఎస్ డైరెక్టర్ కాలవ పూర్ణయా, పంచాయితీ కోఆప్షన్ సభ్యుడు దామెర్ల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులు



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

**దుమ్ముగూడెం:** మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో కిన్నెరసానిలోని మోడల్ క్రీడా పాఠశాలలో ఈ నెల 4, 5,6 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో రాణించారు. నాలుగో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో పాఠశాల విద్యార్థులు బహుమతులను అందుకున్నారు. వారిలో జూనియర్ వాలీబాల్లో నూపా అన్వేష్, సీనియర్ వాలీబాల్ లో పూసం వరుణ్ ఉన్నారు. వీరు త్వరలో జరిగే ఆదిలాబాద్లో జరిగే ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్ఎల్)లో పాల్గొననున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడకం మోతీరు అభినందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కారం సర్వేష్, పీడీ హరికృష్ణ, సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రీనివాస్, ఆంజనేయులు, బోడియా, ప్రసాద్ రావ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాకర్రావు కృషి మరువలేనిది

**మణుగూరురూరల్:** పద్మశాలి సమాజానికి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు, దివంగత మచ్చ ప్రభాకర్రావు చేసిన కృషి ఎనలేనిదని ఆ సంఘం మండల అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దుస్సా సమ్మయ్య అన్నారు. మండలంలోని సమితిసింగారంలో గల పద్మశాలి సేవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మచ్చ ప్రభాకర్రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తహసీల్దార్గా పని చేసి పదవీ విరమణ పొందిన తర్వాత ప్రభాకర్రావు సంఘం ఐక్యత కోసం, పద్మశాలిలందరినీ ఏకత్రాటిపై తీసుకొచ్చేందుకు కృషి చేశారని తెలిపారు. సంఘం మండల కార్యదర్శి కోట శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, కోశాధికారి మెరుగు రవీంద్రనాథ్, దాసరి అనిల్కుమార్, సిరిపురం కోటేశ్వరరావు, తాటి సత్యనారాయణ, కృష్ణయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, కనకయ్య, నరేందర్ పాల్గొన్నారు.

# వనభోజన మహోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న విద్యుత్శాఖ ఏఈ వేణుగోపాల్

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామంలోని సమ్మక్క–సారక్క దేవాలయ ప్రాంగణంలో రజక సంఘ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యుత్శాఖ ఏఈ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి, రజక కుల దైవం మడేలు మాచయ్య చిత్రపటానికి రజక సంఘ నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు పున్నం ఉమామహేశ్వరరావు, పాడువుగంటి సాంబశివరావు, అక్కినపల్లి సత్యనారాయణ, రాపర్తి శ్రీహరి, తనకం ముజకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వాలీబాల్ టోర్నీ

**చర్ల:** మండలంలోని సుబ్బంపేటలో ఏర్పాటు చేసిన మూడు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, సీఐ బి.రాజగోపాల్ చేతుల మీదుగా వాలీబాల్ పోటీల్లో విన్నర్, రన్నర్స్ నిలిచిన జట్లకు ట్రోఫీతో పాటు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

# ఏటీఏ క్యాలెండర్లు ఆవిష్కరణ



ఏటీఏ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్టీఓ రజియా సుల్తానా

**అశ్వారావుపేటరూరల్:** ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ను స్థానిక ఎస్టీఓ రజియా సుల్తానా చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ఆ సంఘం సమావేశంలో అధ్యక్షుడు కొర్సా రాజేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఏటీఏ నిరంతరం పని చేస్తుందన్నారు. తక్షణమే నిలిచిపోయిన టీచర్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పద్దం రాము, తాటి శ్రీనివాస్, సున్నం ప్రసాద్, జారే నాగరాజు, పద్దం శ్రీను, ఈసాల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

**చర్ల:** విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ముందంజలో ఉంటుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్యామల రామారావు పేర్కొన్నారు. ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్ను సోమవారం చర్లలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీజీ హెచ్ఎం టి.బీష్మమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర నాయకుడు బి.సత్యనారాయణ, ఎ.శ్రీనివాసరావు, ఎస్.వీరాస్వామి, మండల ప్రధాన కార్యదర్శి తోకల నర్సింహామూర్తి, నాయకులు కె.చిట్టిబాబు, ఎస్.శేషు, పి.మురళీ, కె.మురళీమోహన్, టి.శ్రీనివాస్, వి.వెంకట్రావు, ఎస్.శ్యాంకుమార్, పి.రామకృష్ణ, ఎం.రాజ్కుమార్, పి.ప్రసాద్, కె.రాజబాబు, పి.అరుణ్, కె.భాగ్యలక్ష్మి, ఎస్.రామలక్ష్మి, కె.రజిని తదితరులు పాల్గొన్నారు.